క్లుప్తంగా

సీసీ రోడ్లకు శంకుస్థాపన



తెనాలిరూరల్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని నందివెలుగు, కొలకలూరు గ్రామాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లకు మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎంపీడీవో అత్తోట దీప్తి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కోడి పందేల బరి ధ్వంసం



సాక్షి ఎఫెక్ట్

తెనాలి: సంక్రాంతి పండక్కి కొల్లిపర మండల గ్రామం బొమ్మువానిపాలెం సమీపంలో కృష్ణానది కరకట్ట దిగువన యుద్ధప్రాతిపదికన ఏర్పాటుచేసిన కోడిపందేల బరిని పోలీసులు ధ్వంసం చేశారు. పండక్కి మూడురోజులపాటు కోడిపందేల నిర్వహణకు చేస్తున్న సన్నాహాలపై 'బరి'తెగింపునకు సిద్ధం' శీర్షికతో శనివారం 'సాక్షి' జిల్లా ఎడిషనులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సాయంత్రం కొల్లిపర ఎస్ఐ పి.కోటేశ్వరరావు సిబ్బందితో సహా అక్కడకు వెళ్లారు. బరికి సిద్ధంచేసిన ప్రదేశాన్ని ట్రాక్టరుతో దున్నించేశారు. చుట్టూ ఉన్న సిమెంటు స్తంభాలను, చలువపందిరిని తొలగించారు. కోడిపందేలు నిర్వహించటానికి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టంచేశారు. నిబంధనలను ఉల్లంఘించి పందేలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ముగ్గున్న లోగిళ్లు... ఆనంద పరవళ్లు!

- ఆచారాలకు, విలువలకు ప్రాధాన్యమిస్తున్న యువతులు
- ఆరోగ్యప్రదాయినిగా నిలుస్తున్న ముగ్గులు

" ఆరనైదోతనము ఏ చోట నుండు / అరుగులొలికే వారి అరచేత నుండు / తీరైన సంపద ఎవరింట నుండు / దిన దినము ముగ్గున్న లోగిళ్ల నుండు " అని ముత్యాలముగ్గు సినిమాలో కవి ఆరుద్ర ముగ్గులను గృహసంపదకు ఉదాహరణగా పేర్కొన్నారు. అదే కాదు ఆ ముగ్గులు వేయడం కూడా ఓ మంచి ఆరోగ్య రహస్యమని చెబుతున్నారు పలువురు. ఎంత ఆధునికత మనమధ్యన చొరబడినా ఇవాల్టికి సంక్రాంతి వస్తుందని గుర్తు చేసేవి మొట్టమొదటివి ఈ రంగవల్లులే!

తెనాలి: పండుగ... మన సంస్కృతి సంప్రదాయాల్లో భాగమే కాదు. అవి మన ఆరోగ్యప్రదాయిని. పెద్దల నుంచి వస్తున్న ఆచారాల వెనుక కచ్చితమైన అర్థం, పరమార్థం ఉన్నాయి. కాలంతోపాటు పరుగెడుతూ ఆధునిక సంతరించుకుంటున్న నేటి యువతలు, మహిళలు, విశిష్టమైన పండుగలను ఆచరిస్తున్నారు. చదువు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణిస్తూ బిజీగా ఉంటున్నా మన ఆచారాలకు విలువనిస్తున్నారు...ఆచరిస్తున్నారు. అందులో రంగవల్లులదే ప్రత్యేకత.

ఇంటిముంగిట ముగ్గులు మెరిసేది.. కచ్చితంగా తెలుగు లోగిలి అని తెలుసుకదా! సంక్రాంతి వంటి ముఖ్యమైన పండగ వచ్చిందంటే ముగ్గులు ప్రతిఇంటా కొలువుదీరతాయి. ధనుర్మాసం మొదలు సంక్రాంతి వరకూ ఇదే వాతావరణం కనిపిస్తుంది. ముగ్గుల పండుగ అంటే చుక్కలు, గీతలు కలిపి సరదాగా కాలక్షేపం కోసం వేసే డిజైన్లు కాదు సుమా! మహిళల్లోని సృజనాత్మకతకు బహిర్గతం చేసే కళకు చిరునామా. పొరుగింటి చిన్నారి కంటే తన ముగ్గు ముచ్చటగా ఉండాలనీ, పదిమందిచేత శెభాష్ అనిపించుకోవాలని ఆడపిల్లలు ఆరాటపడతారు. ఆలోచనల్ని చిత్రిక పట్టి, చుక్కలతో బియ్యపుపిండి / సున్నంపిండిని కలిపి ఆకర్షణీయ డిజైనుతో వహ్వా అనిపిస్తారు. వివిధ సంస్థలు, సంఘాలు ఏటా నిర్వహించే ముగ్గుల పోటీలూ ఇందుకు ఆస్కారాన్నిస్తున్నాయి. పండగులప్పుడు తమ సృజనను మరింతగా బహిర్గతం చేయటానికి ఆడపిల్లలు/ మహిళలు ఏమాత్రం సంకోచించటం లేదు. కొత్తగా కాన్సెప్ట్ ముగ్గులు వస్తున్నాయి. అందుబాటులోకి వచ్చిన అంతర్జాలం టెక్నాలజీని అందింపుచ్చుకుని, తమ సృజనకు మెరుగులు దిద్దుకుంటున్నారు. ముగ్గులు వేసే సమయంలో అనుసరించే భంగిమల్లో, ఆరోగ్యానికి భరోసానిచ్చే యోగం దాగుందని దివంగత 'యోగాచార్య' షేక్ మొహిద్దీన్ బాచ్చా ఏనాడో చెప్పారు. ఏతావాతా చెప్పొచ్చేదేమంటే కాలానికి తగినట్టుగా ఆధునికతకు మారుపేరుగా ఉంటున్నప్పటికీ ముగ్గుల కళను ప్రేమించే అమ్మాయిలు ఎక్కువగానే ఉంటుండటం సంస్కృతీ సంప్రదాయాల భవిష్యత్తుపై విచారపడే పెద్దలకు ఊరట అనే చెప్పొచ్చు. సంక్రాంతి ముగ్గుల్లో గొబ్బెమ్మలు ప్రత్యేక ఆకర్షణ. గ్రామాల్లో ముందురోజే సేకరించిన ఆవుపేడతో గొబ్బెమ్మలను చేస్తారు. పసుపు కుంకుమలతో అందాలు చేకూరుస్తారు. గుమ్మడిపూలు, బంతి, చేమంతులు, తామరలు, డిసెంబర్ పూలతో అలంకరిస్తారు. గొబ్బెమ్మలకు కళ్లు స్థానంలో గురివింద గింజల్ని, ముక్కుగా సంపెంగలనీ ఉంచుతారు. వాటిని ముగ్గుల మధ్యలో ఉంచి పూజ చేస్తారు. గొబ్బెమ్మను గౌరీదేవిగా కొలిచేవారున్నారు. గోమాతలో లక్ష్మీదేవి కొలువై ఉంటుందనీ, గొబ్బెమ్మ ఆమెకు ప్రతిరూపమనీ భావిస్తారు. పండగ వేళ తమను చల్లగా చూడమని అంతా కోరుకుంటారు. కన్నెపిల్లలే కాదు, ముత్తయిదువులూ గొబ్బెమ్మల్ని పెట్టి, తమ పసుపుకుంకుమలు, పిల్లాపాపలు చల్లగా ఉండాలని వేడుకుంటారు. ధనుర్మాసం నుంచి సంక్రాంతి వరకు నెలరోజులు ముగ్గుల్లో ఉంచుతూ వచ్చిన గొబ్బిళ్లను పిడకల్లా చేసి ఎండబెడతారు. వాటిని దండగా చేసి, భోగి పర్వదినాన తెల్లవారుజామున వేసే భోగి మంటల్లో వేస్తారు. సంక్రాంతిరోజు ఉంచే గొబ్బెమ్మల్ని ఎండబెట్టి దాచి ఉంచుతారు. రథసప్తమి రోజు సూర్యుడి ఎదుట పెట్టి వెలిగిస్తారు. ఆ పిడకలపైనే పరమాన్నం చేసి సూర్యభగవానుడికి నైవేద్యం సమర్పించటం ఆచారం.

గోవు పవిత్రత తెలిసిందే. పేడ క్రిమిసంహారిణిగా పనిచేస్తుంది. ఇంట్లోకి సూక్ష్మ క్రిములు రాకుండా నిరోధిస్తుందనే కళ్లాపిగా చల్లుతారు. బియ్యం పిండితో ముగ్గులు వేయటంలో భూతదయ ఉంది. ఉడతలు, పిచ్చుకల వంటి చిన్నచిన్న జీవులకు బియ్యం పిండి ఆహారంగా పనికొస్తుంది. సున్నం పిండితో ముగ్గువేసినా, కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసేసుకుంటుంది. దీనివల్ల గాలి శుభ్రపడుతుంది. భోగి మంటలు కేవలం చలికాచుకోవటానికే కాదు, ఇళ్లలో ఉండే పాత సామాన్లు, పాత ఫర్నీచరు, అట్టలు వంటివి వదిలించుకోవచ్చు. సాయంత్రం పిల్లలకు భోగిపళ్లు పేరుతో పోసే రేగుపళ్లు దృష్టిదోషాల నివారిణి అంటారు. సంక్రాంతికి ఇంటికొచ్చే కొత్త పంట బియ్యంతో బెల్లం కలిపి చేసే పిండివంటలు ఆరోగ్యానికి సోపానాలు. మన ఆచార్య వ్యవహారాల్లో ఇంతటి మహత్తరమైన ఆరోగ్యపరిరక్షణ, పర్యావరణ రక్షాలు అంశాలు ఇమిడివున్నాయి.



ముగ్గులు తీర్చిదిద్దుతున్న యువతులు









రకరకాల ముగ్గులు

అమ్మ నుంచి నేర్చుకున్నాం



తెనాలి ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో సెకండ్, ఫైనలియర్ బీఎస్సీ బయోటెక్ చదువుతున్నాం. ముగ్గులు బాగా వచ్చు. చిన్నప్పటి నుంచే ముగ్గులు వేయటం అమ్మ దగ్గర్నుంచి నేర్చుకున్నాం. పండక్కి కొత్త ముగ్గులు వేయాలని చూస్తున్నాను.

– కె.గురువెంకట నాగదుర్గ, యు.సాయిప్రత్యూష, బీఎస్సీ విద్యార్థినులు

ఇప్పుడే కొత్తగా వేస్తున్నా



తెనాలిలో బీకాం సెకండియర్ చదువుతున్నా. ముగ్గులు వేయటం నాకు రాదు. కాలేజీలో జరిగిన ముగ్గుల పోటీల్లో ఏదోక కాన్సెప్ట్‌తో ముగ్గు ఎందుకు వేయకూడదు అని అనుకున్నా... ప్రయత్నించి 'స్టాప్ వయోలెన్స్... గివ్ రెస్పెక్ట్' అనే స్లోగన్‌తో మహిళ బొమ్మతో ముగ్గువేశా. ప్రైజ్ కూడా వచ్చింది.

-వేల్పూరి ఆనందవర్ధిని, బీకాం విద్యార్థిని

చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి



తూములూరు(కొల్లిపర): యువతీ, యువకులు, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎన్.బావనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 5వ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా శనివారం మండలంలోని తూములూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులకు, యువతి, యువకులకు, మహిళలకు ముగ్గులు పోటీలు, మ్యూజికల్ చైర్స్, స్కిపింగ్ తదితర పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సభకు యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి కేదా ర్నాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొలక శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ఈనాటి తరం చూడు అలవాటులకు యువత నిర్వీర్యం అయిపోతోందని వారిని చెడు అలవాటు నుంచి తప్పించేందుకే ఈ క్రీడలు అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు స్వర్ణలత, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

పట్టభద్రులతో సమావేశం

తెనాలిరూరల్: కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కూటమి పార్టీల అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక రత్నా ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో తెనాలి, వేమూరు నియోజక వర్గాల పట్టభద్రుల సమావేశం శనివారం నిర్వహించారు. సభలో మంత్రి మనోహర్ అధ్యక్షోపన్యాసం చేశారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పట్టభద్రుల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, కఠారి వాసు దేవనాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస వేడుకలు

రేపల్లె రూరల్: మండలంలోని పోటుమెరక గ్రామం జలార్తమ్మ ఎస్టీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సమరసత సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కుదారై వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర రావు మాట్లాడుతూ గోదాదేవి తన భక్తితో విష్ణుమూర్తి మెప్పించి మోక్షం పొందిందని, సాక్షాత్తూ విష్ణుమూర్తిని భర్తగా పొందిందన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

తెనాలి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో 'వర్ణిక' పేరుతో గత నాలుగురోజులుగా జరుగుతున్న సంబరాలు శనివారం ముగిశాయి. చివరిరోజున జరిగిన ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ సృజనను చాటి అభినందన లు అందుకున్నారు. ముగింపు సభలో ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాలేజీలో చదువు, నైపుణ్యాలతోపాటు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించటానికి ఏటా ఈ తరహా ఈవెంట్స్ జరుపుతున్నట్లు గుర్తు చేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా బాలురకు బాక్స్ క్రికెట్, తగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ కార్డ్, రీల్స్ విభాగాల్లో, బాలికలకు ఇన్ అండ్ అవుట్, తగ్ ఆఫ్ వార్, ట్రెజర్ హంట్, మ్యూజికల్ కార్డ్ రీల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించి డిగ్రీ మూడు సంవత్సరాల విద్యార్థులకు వేర్వేరుగా బహుమతులను అందజేశారు. ఈవెంట్‌ని పర్యవేక్షించిన ఫైనలియర్ డిగ్రీ విద్యార్థులను శివకుమార్ అభినందించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రాంచంద్, అధ్యాపకులు బి.రాజీవ్, ఎస్‌వీ శర్మ, రోహిణి, అనితాదేవి, పద్మావతి, జయశ్రీ, రూబీప్రియదర్శిని, శారద పాల్గొన్నారు.

జేఎంజే మహిళా కాలేజీలో....

స్థానిక జేఎంజే మహిళా కాలేజీలో గృహవిజ్ఞాన శాఖ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినులు ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి, లక్ష్మీపూజలు చేశారు. విద్యార్థినులు తమ నృత్యాలతో అలరించారు. సంక్రాంతి పర్వదిన విశిష్టతపై ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైనీ మాట్లాడగా, ముఖ్యఅతిథి డాక్టర్ నాగజ్యోతి మకర సంక్రాంతి గురించి, ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగిమంటల ప్రాధాన్యతను వివరించారు. సంక్రాంతి వేడుకల్లో రైతులు ప్రాముఖ్యతను తెలియజేశారు. గృహవిజ్ఞానశాఖ అధికారిణి డాక్టర్ హేమలత పాటిబండ్ల, స్రవంతి, సహాయక సిబ్బంది, అన్నమ్మలు పర్యవేక్షించారు.

లిటిల్ హార్ట్స్ , హరిత బాలకుటీర్‌లో

స్థానిక రవీంద్రనాథ్ నగర్‌లోని లిటిల్ హార్ట్స్, హరిత బాలకుటీర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా జరిపారు. పిల్లలకు భోగి పళ్లను పోసి ఆశీర్వదించారు. ఇదే వేడుకలో విద్యార్థినులు ఉత్సాహంగా రంగవల్లుల పోటీలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. స్కూల్ డైరెక్టర్ పి.అనంత్, ప్రిన్సిపాల్ పి.శివపార్వతి, ఉపాధ్యాయులు యు.శ్రీలక్ష్మి, కళ్యాణి, శ్రీకళ, సాహితి, పద్మజ, మేరి, అనూష, మహేశ్వరి తదితరులు పర్యవేక్షించారు.

మదర్ థెరిస్సా ఇన్‌స్టిట్యూట్‌లో...

పట్టణ గాంధీనగర్‌లోని సెయింట్ మదర్ థెరిస్సా ఇన్‌స్టిట్యూట్‌లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, స్టిక్కరింగ్ వంటి వివిధ రకాల పోటీలను శనివారం నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంక్రాంతి పండగ ప్రాధాన్యతను పిల్లలకు వివరించారు. సంస్థ డైరెక్టర్ చిలుకూరి శౌరి పర్యవేక్షించారు.



ఏఎస్ఎన్ కాలేజీ సంక్రాంతి సంబరాల్లో మాజీ ఎమ్మెల్యే శివకుమార్



జేఎంజే కాలేజీలో ముగ్గుల పోటీలు



27వ వార్డులో చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదిస్తున్న సిబ్బంది



మదర్ థెరిస్సా ఇన్‌స్టిట్యూట్‌లో సంక్రాంతి సంబరాలు



లిటిల్‌హార్ట్స్, హరిత బాలకుటీర్‌లో సంక్రాంతి వేడుక

కోడి పందేలు నివారించండి

తెనాలిరూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో ఎక్కడా పందేలు జరుగకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, మహిళా పోలీసులతో పాటు తెనాలి పట్టణ, రూరల్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు.

కోడి పందేలకు అనుమతి లేదు

కొల్లిపర: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలల్లో కోడిపందెలకు, జూదం ఆటలకు ఎటువంటి అనుమతి లేదని ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా కోడిపందెలు, జూదరులు జూదం ఆడుతున్నట్లు సమాచారం తెలిసినా, సూచిన వెంటనే పోలీసులకు సమాచారం అందిచాలని సూచించారు. కోడిపందెలకు, జూదంకు ఎటువంటి అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమించి ఎవరైనా నిర్వహిస్తే.. అటువంటి వారిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. వీటిపై పోలీసులకు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుటం జరుగుతుందని, ఎటువంటి అపోహలు ప్రజలు పెట్టుకోకుండా సరైన సమయంలో పోలీసులకు సమాచారం అందించి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

వైభవంగా కూడారై మహోత్సవం

తెనాలి: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్–వీఎస్సార్ కాలేజి రోడ్డులోని ప్రత్యేక వేదికపై జరుగుతున్న శ్రీధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణ దీక్షా మహోత్సవల్లో భాగంగా శనివారం గోదాదేవి 27వ పాశురాన్ని ద్రవిడ భాషలో స్తుతించారు. 508 ఇత్తడి గంగాళాల పాయసం నివేదనతో కూడారై ఉత్సవాన్ని వైభవంగా జరిపారు. ఈ విశేషాలను మొవ్వ వృషాద్రిపతి భక్తులకు వివరించారు. శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి మంగళాశాసనాలతో శ్రీశరణాగతి గోష్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీనరేంద్ర రామానుజ దాసస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ వేడుకలు జరుగుతున్నాయి. అనంతరం భక్తులకు తీర్థం, అన్నప్రసాద వినియోగం చేశారు.

శ్రీవిద్యాపీఠంలో...

స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ధనుర్మాసం 27వ రోజున శ్రీబాలస్వామీజీ తిరుప్పావై పాశురాలను చదివారు. పాయసాన్నం చేసి భక్తులకు పంపిణీ చేశారు. ఈనెల 13న కళ్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కోశాధికారి గోవు రామకృష్ణ, లోకనాథం, రామకృష్ణ, సుమంత్, శ్రీవిద్యాపీఠం, శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్, శ్రీజయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో...

స్థానిక అమరావతి ప్లాట్స్‌లోని గోదాదేవి, పద్మావతీదేవి, శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 27వ రోజున కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 108 గంగాళాల్లో పాయసాన్ని చేయించి స్వామివారికి నివేదన చేశారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. దేవభక్తుని ఉమామహేశ్వరరావు, కనకమేడల పుష్పకుమారి, కిక్కూరి కృష్ణారెడ్డి పర్యవేక్షించారు. 13వ తేదీన స్వామి కళ్యాణోత్సవం జరుగుతుందని తెలియజేశారు.



శరణాగతి గోష్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో కూడారై ఉత్సవం



శ్రీవిద్యాపీఠంలో పాల్గొన్న బాలస్వామీజీ



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో

ఆరోగ్యకర జీవనం ప్రకృతి విధానంతోనే సాధ్యం

సుభాష్ పాలేకర్ కృషి విధాన సాధకుడు విజయరామ్



మాట్లాడుతున్న విజయరామ్

తెనాలి: భూమి నానాటికీ వేడెక్కుతూ తింటున్న ఆహారం విషపూరితం కావటం వంటి ప్రధాన సమస్యలను భవిష్యత్ తరాలకు అందించటం తగదని సుభాష్ పాలేకర్ కృషి (ఎస్‌పీకే) విధాన సాధకుడు విజయరామ్ అన్నారు. ప్రకృతి సాగు విధానాలతో వ్యవసాయం చేస్తూ ఆరోగ్యకర జీవనవిధానాన్ని అలవరచుకోవాలని ఆయన సూచించారు. శ్రీభారత్ ఫౌండేషన్, సేవ్ అర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం రూరల్ మండలం కొలకలూరులోని మూర్తిగారి తోటలో గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు 'సస్యశ్యామలమ్'ను నిర్వహించారు. విజయరామ్ మాట్లాడుతూ హరిత విప్లవం వచ్చినపుడు గల వ్యవసాయ పద్ధతులను దేశవాళీ విత్తనాలతో అవలంబించాలని అభిప్రాయపడ్డారు. వ్యవసాయా న్ని లాభసాటిగా నిలిపేది ఆవుతో చేసే సాగు మాత్రమేనన్నారు. తక్కువ నీరున్నా ధైర్యంగా వ్యవసాయం చేయొచ్చని, వర్షపునీటిని పొలాల కింద పదడుగుల లోతులో దాచిపెట్టి, తిరిగి మొక్కలకు ఇచ్చేది ఆవుతో చేసే వ్యవసాయంతోనేనని చెప్పారు. చదువుకుని ఉద్యోగం చేసేవారు, వ్యాపా ర వృత్తులో ఉండేవారు ఎవరైనా 40 ఏళ్ల వయసు దాటాక విధిగా వ్యవ సాయం చేయాలన్నారు. సేంద్రియ పద్ధతిలో పంటలు పండించడం ద్వారా, ఆరోగ్యంగా హాస్పిటల్‌కి వెళ్లకుండా ఉండగలుగుతామని చెప్పా రు. తెలంగాణ రాష్ట్ర జాయింట్ కమిషనర్ (జీఎస్టీ) ఎద్ల శ్రీలేల మాట్లాడుతూ ప్రకృతినీ, వ్యవసాయాన్ని వేరుగా చూడడం వల్ల జీవన శైలి మారిపోతోందని అన్నారు. పాశ్చాత్య ధోరణిలోకి వెళ్లిపోతూ భారతీయ సమాజం అనారోగ్యం పాలవుతోందని చెప్పారు. విత్తనాలు, ఎరువులు వంటి వ్యవసాయ పద్ధతులను తెలుసుకుని ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని కోరారు. శ్రీభారత్ ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రిక మాట్లాడుతూ విద్యా ప్రణాళికలు, ప్రకృతి వ్యవసాయ విధానాలు, అభివృద్ధి, మహిళా సాధికార త, పోషకాహార విలువలపై తమ సంస్థ పనిచేస్తున్నట్టు తెలిపారు. శ్రీభారత్ ఫౌండేషన్ సభ్యులు ఎస్.శ్రీసాయిరాం, సీహెచ్.రవిశంకర్, చిన్నారి స్నేహం గ్రూప్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

బాపట్ల: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముత్తాయిపాలెంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గవిని వెంకట సాయి(23) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తూ సంక్రాంతికి ఇంటికి వచ్చాడు. బంధువులతో కలిసి మెలిసి ఉంటూ శనివారం ఉదయం గొడ్లచావిడిలో ఉరివేసుకుని మృతి చెందాడు. కేసును రూరల్ సీఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.